ప్రజాశక్తి

శనివారం 10 మే 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ఉపాధి వేతనాలేవీ?

- కార్మికులకు ఐదు వారాలుగా పెండింగ్
- పూర్తయిన పని దినాలు 21 లక్షలు
- ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం రూ.60.15 కోట్లు
- పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కరువు
- వారం రోజుల్లోనే గుండెపోటులో ఇద్దరు కార్మికులు మృతి
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు



మృతుడు వాలి నాయక్

ఘంటసాల మండలంకొత్తపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

"ఉపాధి కార్మికులను ఉపాధి హామీ గ్రామీణ శ్రామికులుగా గౌరవిద్దాం" అని మాటల్లో కార్మికులపై గౌరవాన్ని చూపుతున్న కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వారి సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కార్మికులకు సకాలంలో వేతనాలు అందకపోయినా పట్టించుకోవడం లేదు. పని ప్రదేశాల్లో మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించడం లేదు. ఈ నేపథ్యంలోనే వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కార్మికులు గుండెపోటుతో పని ప్రదేశాల్లోనే మరణించడం ఆందోళన కలిగిస్తోంది.

కృష్ణాజిల్లాలో 2,20,324 మందికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జాబు కార్డులున్నాయి. దీనిలో 3,90,656 మంది సభ్యులున్నారు. గ్రామాల్లో ఎక్కడా వ్యవసాయ పనులు లేకపోవడంతో రోజుకు 86 వేల మందికిపైగా గ్రామీణ పేదలు ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం ఏప్రిల్ 1 నుంచి మే 3వ తేదీ వరకు 21 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి రూ.60.15 కోట్లు కార్మికుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తు కాలం వెళ్లదీస్తున్నారు. మరోపక్క చేసిన పనికి వేతనంలోనూ కోత పడుతోందని ఉపాధి కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సగటున ఒక్కో కార్మికుడికి రోజుకు చేసిన పని కొలతల ఆధారంగా రూ.307 చెల్లించాల్సి ఉండగా, సగటున రూ.270 నుంచి 285 వరకు మాత్రమే ఆన్‌లైన్లో నమోదవుతోందని కార్మికులు వాపోతున్నారు.

వారం రోజుల్లో ఇద్దరు కార్మికులు మృతి

వేసవి సీజన్లో ఉపాధి హామీ చట్టం పని ప్రదేశాల్లో కార్మికులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడానికి షామియానాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పని చేసే క్రమంలో తాగునీరు అందుబాటులో ఉంచాల్సి ఉంది. ఇవేమీ పని ప్రదేశాల్లో ఉండడంలేదు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి సరిపెడుతున్నారు. పని ప్రదేశాల్లో ఎవరైనా గాయపడినా, ఆనారోగ్యానికి గురైనా ప్రాథమిక చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉండడంలేదు. దీంతో ఉపాధి పనికి వెళ్లిన ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామానికి చెందిన వాలి నాయక్ (60), అవనిగడ్డ మండలం మోదుమూడికి చెందిన చందన నాగమల్లేశ్వరరావు (42) పని ప్రదేశంలోనే గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి పని ప్రాంతాల్లో తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలి?

మేరుగు మధు, ఉపాధి కార్మికుడు, కొత్తపల్లి, ఘంటసాల మండలం

ఎక్కడా వ్యవసాయ పనులు లేవు. రెక్కల కష్టం మీద ఆధారపడి బతుకుతున్నాం. రోజు పనికి వెళుతున్నా. కూలి డబ్బులు బ్యాంకులో పడతాయని చూస్తున్నా. వారం వారం డబ్బులు చెల్లించకపోతే ఎలా బతకాలి. ప్రభుత్వం ఇంకా ఆలస్యం చేస్తే పస్తులుండాల్సి వస్తుంది.

ఐదు వారాలుగా డబ్బులు పడలేదు

మండే రవి, ఉపాధి కార్మికుడు, కొత్తపల్లి, ఘంటసాల మండలం

ఐదు వారాలుగా రోజూ పనికెళుతున్నా. ఏ రోజుకారోజు డబ్బులు బ్యాంకులో పడతాయని చూస్తున్నాం. బ్యాంకర్లు డబ్బులు పడలేదని చెబుతున్నారు. పనికెళ్లినా అప్పులు చేసి తినాల్సి వస్తోంది.



సముద్రతీర ప్రాంతంలో పర్యటిస్తున్న కృష్ణాజిల్లా ఎస్‌పి ఆర్.గంగాధరరావు తదితరులు

తీరంలో భద్రత మరింత పటిష్టం

- కృష్ణా ఎస్‌పి గంగాధరరావు వెల్లడి
- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలో తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాల జిల్లావ్యాప్తంగా తీరప్రాంతంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు కృష్ణాజిల్లా ఎస్‌పి ఆర్.గంగాధరరావు తెలిపారు. భూభాగాల ద్వారానే కాకుండా జలమార్గం ద్వారా శత్రువులెవరు ప్రవేశింపకుండా సముద్రతీరం వెంబడి భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసినట్లు చెప్పారు. మచిలీపట్నం మండలం గిలకలదిండి సముద్ర తీర ప్రాంతాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. గిలకలదిండి న్యూ ఫిషింగ్ హార్బర్ నుండి పడవ ద్వారా మెరైన్ పోలీసులతో కలిసి మొగ వరకు వెళ్లి అక్కడి రక్షణా పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి, అక్కడ ఎన్ని బోట్లు ఉన్నాయి, వాటి పనితీరు, ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు వంటి అంశాలను ఎస్ఐ బోస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భారత్ భూభాగంలోకి శత్రువులు చొచ్చుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సముద్రతీర ప్రాంతాలైన గిలకలదిండి, వర్లగొంది తిప్ప, పోలాటితిప్ప పరిసర ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్ కెమెరాలతో ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనుమానితుల కదలికల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంత గ్రామాలను పోలీసు అధికారులు తరచూ సందర్శించి నిఘా, సమాచార వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు.

తప్పుడు ప్రచారం చేసినా, విద్వేషాలు రెచ్చగొట్టినా కఠిన చర్యలు : ఎస్‌పి

ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు ప్రచారం చేసినా, విద్వేషాలు (మిగతా 2లో)



విజయవాడలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

దుర్గగుడి ఇఒ నాయక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఇఒ)గా వి.కె. శీనానాయక్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అనివేటి మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించిన అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఇఒగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం దేవస్థానంలోని వివిధ విభాగాల అధికారులు, ఇతర ఇబ్బందితో సమావేశమయ్యారు. సందర్శకులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అన్నప్రసాదం తయారీ, లడ్డు, పులిహోర ప్రసాదం తయారీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్న ప్రసాదశాలలో వినియోగించే బాయిలర్ల మరమ్మతుల గురించి సిబ్బంది ఆయనకు వివరించారు. అనంతరం లడ్డు ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కోటేశ్వరరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శీనా నాయక్

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - విజయవాడ : కూతురి వరసయ్యే బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్ట్ జడ్జి వి.భవానీ తీర్పు చెప్పారు. కేవలం నేరం జరిగిన 10నెలల కాలంలో నిండితుడికి శిక్ష పడేలాగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నున్న పోలీసు స్టేషన్ పరిధిలో నూజివీడుకు చెందిన బెజవాడ రాంబాబు అనే వ్యక్తి గత ఏడాది జూన్ 7వ తేదీన తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. ఈఘటనపై బాధితురాలి తల్లి నున్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అప్పటి మహిళా పిఎస్ ఇన్చార్జి ఎసిపి స్రవంతి రాయ్ (ప్రస్తుతం నార్త్ ఎసిపి) కేసును విచారించి గత ఏడాది ఆగస్టు 2న నిందితుడైన బెజవాడ రాంబాబును అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం ఛార్జిషీటు ఫైల్ చేశారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వి.భవానీ నిందితుడుకి 29 ఏళ్లపాటు కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. బాధిత బాలికకు జరిమానా నుండి రూ.10 వేలను, రూ.5 లక్షల నష్టపరిహారం వచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.కష్ణ వేణి, అప్పటి మహిళా ఎసిపి ప్రకాష్ బాబు, నార్త్ ఎసిపి స్రవంతి రాయ్, ప్రస్తుత మహిళా పిఎస్ ఎసిపి కె.లతాకుమారి, సిఎంఎస్ ఇనస్పెక్టర్ జగదీశ్వరరావు, సిఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో 12 మంది సాక్షులను విచారించారు.



ఫ్రైడే డ్రైడే ఖచ్చితంగా పాటించాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : ఫ్రైడే డ్రై డే పురస్కరించుకొని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం రామకష్ణాపురంలో మలేరియా నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటి లోపల, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా గుర్తింపు నిర్వహించి, వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులకు కారకాలైన దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. బుడమేరులో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపును, డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయడాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, బయాలజిస్ట్ సూర్య కుమార్ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై విఎంసి కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర శుక్రవారం విఎంసి ప్రధాన కార్యాలయంలో ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు, పట్టణ ప్రణాళిక శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రహదారి కిక్కిరిసిన ప్రాంతాలు, అవరోధాలపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ (ఏడీసీపీ) ప్రసన్న కుమార్, సీఐ ఉమామహేశ్వరరావు, సీఐ సత్య రమేష్, వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, డీసీపీ చంద్ర బోస్, ఏసీపీ మోహన్ బాబు పాల్గొన్నారు.



తీరంలో భద్రత మరింత పటిష్టం

(మొదటి పేజీ తరువాయి)

రెచ్చగొట్టాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం కేంద్ర హోం శాఖ ఆదేశం మేరకు కష్ణా జిల్లా వ్యాప్తంగా పటిష్ట చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఎస్‌పి గంగాధరరావు మచిలీపట్నం పరిధిలోని బస్టాండ్, రైల్వే స్టేషన్లను, అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెనుమూడి వారిధి వద్ద గల చెక్‌పోస్టును పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు తారసపడినా, ఎవరి కదలికలైనా సందేహాస్పదంగా ఉన్నా ప్రమాదకరమైన (పేలుడు పదార్థాలు వంటివి) వస్తువులను కనుగొన్నా వెంటనే 9440796400కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో తనిఖీలు

యంత్రాంగం : ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేశారు. లాడ్జిలు, హోటళ్లు, అనుమానిత ప్రదేశాలలో గురువారం రాత్రి విస్తత తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నగరంలో రాత్రి గస్తీ, అనుమానిత వ్యక్తులు, అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఇన్చార్జి పోలీసు కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు అడ్మిన్ డిసిపి కె.జి.వి.సరిత నేతృత్వంలో ప్రత్యేకంగా పోలీసు బందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీ నిర్వహించారు. ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



విజయవాడ రూరల్ : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత దిశగా అడుగులేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శుక్రవారం ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాలకు చెందిన 70 మంది మహిళలు కష్ణాజిల్లా సూరంపల్లిలోని అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రపెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ) పారిశ్రామిక ఎస్టేట్‌ను సందర్శించారు. ఇప్పటికే యూనిట్లు ప్రారంభించి నడుపుతున్న వారితోపాటు భవిష్యత్తులో పరిశ్రమలను స్థాపించాలనుకునే మహిళలు ఉన్నారు. ఏఎల్ఈఏపీ చేయూతతో ప్రారంభమైన పారిశ్రామిక యూనిట్ల యజమానులతో మహిళలకు అవగాహన కల్పించారు. శ్రీకాంత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ శ్యామలాంబ ఫుడ్ ప్రొడక్ట్స్, శ్రీ సహస్ర ఇండస్ట్రీస్, హెచ్‌వీ ఆగ్రో టెక్, కోనా ఫుడ్స్, గ్రామీణ, రమ్య గార్మెంట్స్ తదితర యూనిట్ల యజమానులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించడానికి ముందస్తు సన్నద్ధత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వనరుల సమీకరణ, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు, నైపుణ్య శిక్షణ, సాంకేతిక మద్దతు, సంప్రదాయ, అధునాతన మార్కెటింగ్ సౌకర్యాలు, ఈ-మార్కెటింగ్ తదితరాలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు వివరించారు. పారిశ్రామిక యూనిట్ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించేందుకు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారిశ్రామికవేత్తగా ఎదిగి తనతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించాలనే దఢ సంకల్పం, ఆలోచనకు ఆశయం తోడైతే విజయవంతంగా ముందుకెళ్లొచ్చని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు ఇప్పటికే విజయవంతంగా పారిశ్రామిక యూనిట్లను నిర్వహిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలను స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని, జీవనోపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఏఎల్ఈఏపీ-విజయవాడ ఛైర్‌పర్సన్ కె.కనకదుర్గ పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలు అమలు చేయండి

విఎంసి కమిషనర్‌కు విజ్ఞాన యాత్ర కార్పొరేటర్ల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థలో కూడా వినూత్న ఆవిష్కరణలను అమలు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను దక్షిణాది రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రలో వెళ్ళిన కార్పొరేటర్లు కోరారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయనను శుక్రవారం కలిశారు. విజ్ఞాన యాత్రలో భాగంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని బెంగళూరు, మైసూరు, మదురై, నాగర్ కోయిల్, తిరువనంతపురం, కొచ్చి నగరపాలక సంస్థలలో పరిశీలించిన వినూత్న ప్రాజెక్టులను కమిషనర్ ధ్యాన చంద్రకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఆయా నగరాల్లో అమలవుతున్న అభివద్ధి కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు అందిస్తున్న



సేవలపై సమగ్ర అవగాహన పొందిన విషయాలను కమిషనర్‌కు వివరించారు. నగరాభివద్ధికి వినూత్న ఆవిష్కరణలను విజయవాడ నగరపాలక సంస్థలో కూడా అమలు చేయడానికి సిఫారసులు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజ రెడ్డి, వైసీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు మొహమ్మద్ ఇర్ఫాన్, నిర్మల కుమారి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ పాలకవర్గ సమావేశంలో వాగ్వాదం

తిరునాళ్ల ఆదాయ, వ్యయాల బిల్లుల కోసం ఛైర్మన్ పట్టు

ప్రజాశక్తి - వత్సవాయి : ఎన్‌టిఆర్ జిలా పెనుగంచిప్రోలులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం శుక్రవారం రసాభాసగా సాగింది. ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు సమావేశమయ్యారు. పెద్ద తిరునాళ్ళ, చిన్న తిరునాళ్లకు సంబంధించి లోపాలు ఉన్నాయని, వీటిపై సమగ్ర విచారణ చేయాలని ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరావు... దేవాదాయ శాఖ కమిషనర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయటం చర్చనీయాంశమైంది. దీనిపై పాలకవర్గ సమావేశంలో ఛైర్మన్, ఇఇ ఎల్.రమకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తిరునాళ్ల ఖర్చులను తనకు ఎందుకు చూపించడంలేదని ఛైర్మన్ ప్రశ్నించారు. తన సందేహాలను నివత్తి చేయాలని ఛైర్మన్ అడగగా, ప్రతిదీ బిల్లు ప్రకారమే చేశామని ఇఇ వివరించారు. అయితే తనకు ప్రతి బిల్లు సక్రమంగా చూపించాకే సంతకం చేస్తానని ఛైర్మన్ స్పష్టం చేయగా, ఆదాయ వ్యయాలకు సంబంధించి బిల్లులు చూపిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో భాగంగా అజెండాలోని అంశాలపై చర్చించారు. నూతన అన్నదాన భవనం, కార్యాలయ భవన నిర్మాణం, మొదటి పొంగలి షెడ్డును ఐదు దుకాణాలుగా మార్చడం, పాత కేశఖండశాలను పొంగలి షెడ్డుగా మార్చడం, డార్మెటరీ కండన శాల తదితర పనులు చేపట్టడంపై సమావేశంలో చర్చించారు. ఆలయ ఈవో కిషోర్ కుమార్, ఏఈఓలు ఉమాపతి తిరుమలేశ్వరరావు, ఎ.రాజు, పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు రూ.156 కోట్లు : మంత్రి

విజయవాడ : రాష్ట్రంలోని అన్ని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, త్రాగు నీరు, రోడ్లను అభివద్ధి చేసేందుకు కషి చేస్తున్నామని గిరిజన సంక్షేమం, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 9 ఐటీడీఏ పీవోలు, ఇతర లైన్ డిపార్ట్ మెంట్ల అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని మంత్రి శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడారు.

బహుళ పంటల సాగువైపు అడుగులు : రాజశేఖర్

విజయవాడ : రైతులు పండిరచిన పంటలకు గిట్టుబాటు ధర పొందేలా బహుళ పంటల (మల్టీక్రాప్)ను చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జలవనరుల శాఖ కార్యాలయ ఆవరణంలోని రైతు శిక్షణ కేంద్రం నందు రాష్ట్రానికి చెందిన మిర్చి, టమాట రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు ఎగుమతి దారులతో నిర్వహించిన మేధోమదన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

స్పష్టమైన ప్రణాళికతో బీసెంట్ రోడ్ సమస్యల పరిష్కారం : విఎంసి

ప్రజాశక్తి - విజయవాడ : బీసెంట్ రోడ్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీధి వ్యాపారుల జీవనోపాధికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఛైర్మన్‌గా ఏర్పడిన టౌన్ వెండింగ్ కమిటీ ఒక స్పష్టమైన, యోచనాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు విఎంసి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీధి వ్యాపారాలను ఒక క్రమపద్ధతిలో అమర్చాలని నిర్ణయించినట్లు తెలిపింది. అస్తవ్యస్తంగా ఉన్న వ్యాపారాల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, పాదచారులు సైతం నడవడానికి ఇబ్బంది పడుతున్నారని, అంతేకాకుండా, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని పేర్కొంది. ఈ సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకు, దానికి అనుగుణంగా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఈ కార్యాచరణను ప్రారంభించినట్లు తెలిపింది. ఏ ఒక్క వీధి వ్యాపారికి కూడా అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.



రూ.20 లక్షల నష్టపరిహారం అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజి (యుజిడి) పని చేస్తూ 2023 జూలై 15వ తేదీన ప్రమాదవశాత్తూ సివెర్ లైన్‌లో పడి చనిపోయిన ఆప్కాస్ కార్మికుడు (స్కావెంజర్) మాణిక్యాలరావు కుటుంబ సభ్యులకు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం రూ.20 లక్షల చెక్కును అందజేశారు. మృతుడు మాణిక్యాలరావు కుటుంబానికి రూ.30 లక్షల మేర పరిహారం ఇవ్వాలని కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గతంలో రూ. 10 లక్షలు అందజేశారు. ప్రస్తుతం మరో రూ.20 లక్షలు చెక్కును మృతుడు మాణిక్యాలరావు భార్య ఎం.యశోదకు కమిషనర్ తన ఛాంబర్లో అందజేశారు. మృతుడి భార్యకు విఎంసిలో ఆప్కాస్ కార్మికురాలిగా నియమించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

గుంటతిప్ప డ్రైన్ డీసిల్టింగ్ పనులు వేగవంతం : ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : నగర పలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం గుంటతిప్ప డ్రైన్, ఆటోనగర్, అయోధ్య నగర్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుండెతిప్ప డ్రైన్లో డిసీల్టింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం అయోధ్య నగర్‌లో గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే షమీ, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్, సూపరిండెంట్ ఇంజనీర్ (వర్క్స్)పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.



డిఎస్‌సి ఉచిత శిక్షణ దరఖాస్తులకు మరో అవకాశం

ప్రజాశక్తి - పామర్రు : రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ 2025పరీక్షలకు టెట్ అర్హత సాధించిన బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఉచిత ఆన్లైన్ కోచింగ్ పొందేందుకు దరఖాస్తులు మరోమారు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి జి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కోసం పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, టీటీసీ,కుల,ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు,ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, టెట్ లోఅర్హతసాధించిన మార్కులు జిరాక్స్ కాపీలతో దరఖాస్తులు చేస్కోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సహాయ బీసీసంక్షేమ సాధికారిక అధికారులు గుడివాడ 9440863241, అవనిగడ్డ 63018 69360, మచిలీపట్నం 98662 56850 నెంబర్ల ద్వారా సంప్రదించాలని తెలిపారు. డివిజన్ సహాయ సంక్షేమ అధికారిణి గురువమ్మ పాల్గొన్నారు.

కృష్ణా జలయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : మన జీవనాధారం కృష్ణమ్మ పరిశుభ్రత మన బాధ్యత అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కోడూరు మండలం ఉల్లిపాలెంలో కృష్ణానదీ తీరాన జల బిరాదరి జాతీయ కన్వీనర్, జనసేన పార్టీ పర్యావరణ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన "హంసలదీవి - మహబలేశ్వర్ కృష్ణా జల యాత్ర"ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పర్యావరణ వేత్త అనుమోలు గాంధీ, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి ఘంటసాల : దేశ విదేశాలకు జ్ఞాన బిక్ష పెట్టిన ప్రాచీన బౌద్ధ క్షేత్రం ఘంటసాలలో ఈ నెల 12వ తేదీ బుద్ధ జయంతి మహోత్సవం రాష్ట్ర ప్రభుత్వ సజనాత్మకత - సంస్కృతి సమితి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఘంటసాలలో శయన బుద్ధ ప్రాజెక్టును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు సందర్శించారు. అనంతరం బుద్ధ జయంతి ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడుతూ బౌద్ధుల కాలంలో మహా విద్యాసంస్థగా విలసిల్లిన మహా చైత్యంలో లభించిన ప్రాచీన బౌద్ధ విగ్రహాలు పారిస్, చెన్నై, ఘంటసాల మ్యూజియంలలో ఉన్నాయన్నారు. ప్రపంచంలో ప్రతి బౌద్ధ భిక్షువు తప్పనిసరిగా సందర్శించాలని భావించే ఘంటసాల బౌద్ధ క్షేత్రంలో ఈ నెల 12వ తేదీ బుద్ధ జయంతి మహోత్సవం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ బుద్ధ జయంతి వేడుకలకు మంత్రులు, ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, డీసీ చైర్మన్ అయినంపూడి భాను ప్రకాష్ పాల్గొన్నారు.



అవనిగడ్డలో...



గన్నవరంలో...

వీర జవాన్‌కు కొవ్వొత్తులతో నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : కశ్మీర్ అంతర్జాతీయ సరిహద్దు రేఖలో కాల్పులకు తెగబడిన పాక్ సైనికులను తిప్పి కొడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఓ యువ జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందడంతో శుక్రవారం అవనిగడ్డలో కూటమి నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జవానుల త్యాగాలను స్మరిస్తూ విజయ సింధూరం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు బండే రాఘవ, మెగావత్ గోపి, దేగల రాఘవ, దాసినేని శ్రీనివాసరావు ,మండలి రామ్మోహన్ రావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : వీర జవాన్ మురళినాయక్ మృతికి జోహార్లు హర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీని శుక్రవారం గన్నవరంలో గన్నవరం జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్సార్సీపీ గన్నవరం ఎంపీటీసీ తిరివిది రవి, జయలక్ష్మి, రజిత, ,వి పద్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన వారిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం పరామర్శించి సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. మండలంలోని విన్నకోట వద్ద గురువారం ట్రాక్టర్ ట్రక్కు తిరగబడి ఇద్దరు యువకులు మతి చెందిన సంఘటన విధితమే. మరణించిన వారి మృతదేహాలను ఎమ్మెల్యే రాము, తెలుగుదేశం పార్టీ నాయకులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవికుమార్, చిట్టిబాబు, కొడాలి రామ రాజు, పేర్ని జగన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అలాగే గుడివాడ నియోజకవర్గం వైసిపి నాయకులు విన్నకోట గ్రామానికి వెళ్లి చనిపోయిన అరుణ్, అభిషేక్ యువకుల మతదేహాలను సందర్శించి వారి తల్లిదండ్రు లకు ప్రఘాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం గుడివాడ లో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి గాయపడి చికిత్స పొందుతున్న యువకులను కూడా పరామర్శించి ధైర్యం అని చెప్పారు. పాలేటి చంటి, గంటా సురేష్,సాయిన రవి, నాగు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము



విశ్వదాత అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-పామర్రు : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు త్యాగం, దాతృత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని పామర్రు ఎం ఎల్ ఏ వర్ల కుమార్ రాజా అన్నారు. పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో గురువారం రాత్రి వివిధ రంగాల్లోని ప్రముఖులకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వదాత అవార్డులను ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.ఎల్.ఏ.కుమార్ రాజా అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవంలో కృష్ణా విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య కూన రాంజీ, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, విశాఖపట్నం ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ ఇంజనీర్ గంట్ల శ్రీను బాబు, ప్రసారభారతి ప్రతినిధి ముదిగొండ రవి శంకర్, ప్రముఖ కూచిపూడి నాట్యాచారుడు వేదాంతం పార్థసారథి, ఉత్తమ ఉపాధ్యాయులు ,కూచిపూడి కళాకా రిణి శివలెంక ఉషా కిరణ్‌లకు విశ్వదాత అవార్డులు అందచేసారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నంలోని పరాసుపేటలో హ్యుమా నిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఫౌండేషన్ గౌరవ సలహా దారులు మచిలీపట్నం సర్వస్వం గ్రంథకర్త విశ్రాంత తాసిల్దార్ మహమ్మద్ సిలార్ దీనిని ప్రారంభిం చారు. సంస్థ అధ్యక్షురాలు షేక్ నూర్జ హాన్, ఉపాధ్యక్షులు ఖాజా బిలాల్, ట్రెజరర్ నాగూర్ హుస్సేన్, ఐక్యం ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు అకూరి శ్వేత పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ రహదారిపై ఎండలో వెళుతున్న ప్రయాణికులకు శుక్రవారం మడుపల్లి కృష్ణకుమారి మజ్జిగ పంపిణీ చేశారు. మనవతా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఎండా కాలం నిర్విరామంగా నిర్వహి స్తున్నట్లు మానవతా సేవా సమితి బాలకృష్ణ తెలిపారు.



ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం కంకిపాడు రోడ్డులో బుడిమేరు వద్ద ఆర్టీసీ బస్సు లారీ ఏదు రుగా ఢీకొన్న సంఘటన శుక్రవారం జరిగింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నారాయణ కు గాయాలు తగలడంతో ఆస్పత్రికి తరలించారు. డంపింగ్ యార్డ్ కి నిప్పు పెట్టడం వల్ల వచ్చిన పొగ కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. గన్నవరం నుండి కంకిపాడు వెళుతున్న ఆర్టీసీ బస్సు కంకిపాడు నుంచి గన్నవరం వస్తున్న లారీ ఎదురెదురు గా ఢీ కొన్నాయి. అధికంగా పొగ సంభవించడం వల్లే ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది పొగను అదుపు చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్టీసీ అధికారులు, కంకిపాడు పోలీసులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు అరండల్ పేట లోని తోట ఏసుబాబు నివాసగహంలో శుక్రవారం ఇన్నర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంటిలో మంటలు వ్యాపించినట్ల పామర్రు అగ్నిమాపక అధికారి ఎన్. రాంబాబు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని 2 లక్షల విలువ గల గహోపకరణాలు కాలిపోయినట్లు ఆయన తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేసి కొంత విలువైన సామాగ్రిని కాపాడినట్లు ఆయన తెలిపారు.



ర్యాలీలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-కోడూరు : ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం చేసిన ఆపరేషన్‌కు మద్దతుగా కోడూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం కోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న షైని, కార్యదర్శి బండే శేషగిరిరావు, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి బండే శ్రీనివాసరావు, శ్రీ కోట రాఘువయ్య డిగ్రీ కళాశాల గౌరవ సలహాదారులు కోట వెంకట సుబ్బారావు, రైతు సంఘం నాయకులు రేపల్లె యోగ ప్రకాష్ భారత్ సైన్యానికి మద్దతుగా ప్రజలంతా ఉండాలని సూచనలు ఇస్తూ మాట్లాడారు. పలు రాజకీయ పార్టీ నేతలు, పలు సచివాలయల సిబ్బంది, కోడూరు వర్తక సంఘం సభ్యులు, కోడూరు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు : గ్రామాల అభివృద్ధిలో ఉపాధి శ్రామికుల పాత్ర ఎంతో కీలకం అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. గూడూరు మండలం గూడూరు పంపుల చెరువు వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులు శుక్రవారం శ్రామికులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉపాధి హామీ పథకం ద్వారా 75.23 లక్షల మందికి సొంత ఊళ్లలోనే ఉపాధి కలుగుతుందని, నీటి సంక్షోభ నివారణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అనంతరం గూడూరు పంపుల చెరువు వద్ద ఉన్న వాటర్ ఫిల్టర్స్ ను పరిశీలించి, ఉపాధి శ్రామికులకు శీతల పానీయాలు స్వయంగా అందచేశారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి ఘంటసాల : మొవ్వ ఐసిడిఎస్ పరిధిలోని ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో ఖాళీ అయిన అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మొవ్వ ఐసిడిఎస్ ఇంచార్జ్ సిడిపిఓ పుణ్యవతి తెలిపారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో తెలియజేస్తూ ఘంటసాల మండలం గోగినేనివారి పాలెం గ్రామంలోని అంగన్వాడి కేంద్రం సహాయకురాలు, చల్లపల్లి మండలం చల్లపల్లి నెంబర్ 12 అంగన్వాడి కేంద్రం సహాయకురాలు పోస్టులకు ఓసి క్యాటగిరి కింద దరఖాస్తుల ఆహ్వానిస్తు న్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు ఫారం మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు వివాహిత మహిళ అయి ఉండి 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. స్థానికులై పదో తరగతి పాస్ అయి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారాలు రెండు సెట్లు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు నివాస విద్యార్హత కుల ధృవీకరణ పత్రాలను జత చేసి అందించాలన్నారు. ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏరియా పరిధిలోని తుంగలవారి పాలెం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ పి శేషుకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల తో మాట్లాడుతూ అర్హత కలిగిన ఓసి మహిళ జనరల్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలం లోని యాకమూరు-1 గ్రామంలో అంగన్వాడీ సహాయకురాలు గా పనిచేయడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శిశు అభివృద్ధి సేవా పథక అధికారిణి భాను శ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.


ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కట్టలేరు వంతెన నిర్మించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - గంపలగూడెం: స్థానిక కట్టలేరు వంతెన నిర్మాణం వెంటనే చేపట్టి ప్రజల కష్టాలను తీర్చాలని గంపలగూడెం మండల కమిటీ కోరింది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ ఆవరణలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో అర్జీ అందజేసింది. ఈ విషయమై ఎంఎల్‌ఎ కె.శ్రీనివాస్ స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అర్జీ అందజేసిన వారిలో మండల కమిటీ కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులున్నారు. పలుచోట్ల విద్యుత్తు లైన్లో పునరుద్ధరణ, భూ సమస్యలపై పరిష్కారం, నూతన పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు 92 అర్జీలు ప్రజాదర్బార్‌లో అందజేశారు. పలు అంశాలపై ఎంఎల్‌ఎ ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


విరాళం అందజేస్తున్న మాజీ ఎంపిపి శ్రీనివాసరావు

సిసి కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని వినగడప గ్రామ పరిరక్షణలో భాగంగా రూ.లక్ష విరాళంగా వచ్చినట్లు గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో నేరాల బారి నుండి కాపాడుకునేందుకు ఆధునిక కాలంలో సిసి కెమెరాలు అత్యంత ఆవశ్యమని చెప్పారు. వాటిని గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చులో ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కోటగిరి (శ్రీను బాబు) శ్రీనివాసరావు రూ.లక్ష చెక్కును అందజేశారు. కెమెరాలకు అవసరమయ్యే పూర్తి ఖర్చు సమకూరితే నిఘా నేత్రాలను వెంటనే ఏర్పాటు చేయొచ్చని అన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎల్‌బిఆర్‌సిఇ ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు

ర్యాంకింగ్ ఉన్న కళాశాలనే ఎంచుకోవాలి

ప్రజాశక్తి - మైలవరం : విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంచి సదుపాయాలు, ర్యాంకింగ్ ఉన్న కళాశాలనే ఎన్నుకోవాలని ఎల్‌బిఆర్ సిఇ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 3, నాలుగో తేదీల్లో మాక్ టెస్ట్ ఈఏపీ. సెట్ నిర్వహించారు. ఈ మార్క్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27 మంది విద్యార్థులకు 5 లక్షల 30 వేల రూపాయల నగదు బహుమతులను, సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన కోసం విద్యార్థులకు ఈ మాక్ టెస్ట్‌ను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్ కన్వీనర్ డాక్టర్ బి రమేష్ రెడ్డి, డాక్టర్ డి వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ సెంటర్లో వైఎస్ విగ్రహం పక్కన పెడతాం : సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ గాంధీ సెంటర్ లో ఉన్న వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహం ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నందున అన్ని విగ్రహాలతో సమానంగా ఏర్పాటు చేస్తామని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. శుక్రవారం నందిగామ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నందిగామ పట్టణం పాత బస్టాండ్ బాబు జగ్జీవన్ రామ్ భవనంలో శుక్రవారం నందిగామ మున్సిపల్ అత్యవసర సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ రమణ బాబు, కౌన్సిలర్లతో జరిగింది. సమావేశంలో పాల్గొన్న సౌమ్య మాట్లాడారు. గాంధీ సెంటర్‌లో వైయస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం నాలుగు రోడ్ల కూడలిలో మూలమలుపు వద్ద ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నందున అన్ని విగ్రహాలతో సమానంగా వాటి పక్కన ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి మున్సిపల్ సమావేశంలో ఎజెండా తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను క్రమబద్ధీకరించుకుంటూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు మున్సిపల్ టిడిపి, వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సౌమ్య

వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించొద్దని వైసిపి నిరసన

నందిగామ గాంధీ సెంటర్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం తొలగించడానికి వీల్లేదని డిమాండ్ చేస్తూ నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. నందిగామ మున్సిపల్ కార్యాలయంలో అర్జీ విన్నపం అందజేశారు. అర్జీ తీసుకోవడానికి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది విముఖత వ్యక్తం చేయడంతో కమిషనర్‌కు మెయిల్, వాట్సాప్ ద్వారా అందజేశారు. అనంతరం నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడుతూ కేవలం రాజకీయ దురుద్దేశంతోనే గాంధీ సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహం తొలగించడానికి టిడిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ విగ్రహం వల్ల ట్రాఫిక్ ఎటువంటి అవాంతరం లేదని, రెవెన్యూ స్థలంలో తహశీల్దార్ కార్యాలయం పరిధిలో విగ్రహం ఉందని హైకోర్టు అనుమతితోనే ఆనాడు వైఎస్ఆర్ విగ్రహం పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. కోర్టులకి సెలవులు ప్రకటించిన తర్వాత మున్సిపల్ సమావేశంలో టేబుల్ ఎజెండాగా వైఎస్ఆర్ విగ్రహం తొలగించడానికి నిర్ణయం తీసుకోవడం దురదష్టకరమని పేర్కొన్నారు. గాంధీ సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహం తొలగిస్తే వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్ కట్టప్ప, పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మాజీ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహన్‌రావు, తదితర వైసిపి నాయకులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఏరియా హాస్పిటల్‌లో ప్రతి నెల 9న గర్భిణీ స్త్రీలకు పమ్స్రా ప్రోగ్రాం జరుగుతుంది. ఈ ప్రోగ్రాం ద్వారా గర్భిణులకు ఆహారం, పౌష్టికాహార, హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. అంబారు పేట శ్రీ సద్గురు బోదానందస్వామి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శుక్రవారం గర్భిణులకు భోజనం, పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ శ్రీ సద్గురు బోదానంద స్వామి చారిటబుల్ ట్రస్ట్ ప్రతి నెల 9న పౌష్టికాహారం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ బోధనంద స్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిర్వాహకులు రామకష్ణ, రమేష్, బుజ్జి నందిగామ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరావు, మెడికల్ సూపరింటెండెంట్ డి.వేంకటేశ్వరరావు, ఆర్ఎంఓ యూ.రమేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ సీతారావమ్మ, డాక్టర్ మాధవిలత, హెడ్ నర్సులు హాస్పిటల్ సిబ్బంది, గర్భిణీలకు ఆహారం అందించారు.


గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

కారును ఢీకొన్న లారీ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వీరులపాడు : వేగంగా వస్తున్న లారీ కారును ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని జగన్నాధపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు మహారాష్ట్ర నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ కంచికచర్ల నుంచి పెద్దాపురం వైపు వస్తున్న కారును జగన్నాధపురం గ్రామంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మణికంఠను 108లో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అధికారులు మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తక్షణమే మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రమాదానికి గురైన కారు

డిసిసిబి చైర్మన్ నెట్టెంకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఉమ్మడి కృష్ణా జిల్లా డిసిసిబి చైర్మన్‌గా నియమితులైన జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్‌ను జనసేన యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ కలిసి శాలువలు, పూల బొకాయితో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్లు కొలగాని రాము, పాకలపాటి డేవిడ్ రాజు, జనసేన మైనారిటీ నాయకులు షేక్ సత్తార్, కొ ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాబు, సర్పంచ్ మద్దుల రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జాన్ బాషా, జనసేన నాయకులు ఆవాల భవానీ ప్రసాద్, చిలుకూరి శ్రీనివాసరావు, శేషం ప్రసాద్, కాసర్ల బాలస్వామి, గుడ్ల రామారావు, నాగంళ్ల సందీప్, గాదె అనిల్, చాపల వెంకటేశ్వర్లు, దేవరగట్ల గోపి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వీర జవాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - మైలవరం : భారత్ పాక్ మధ్య జరుగుతున్న పోరాటంలో తెలుగు జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ కుటుంబానికి యావత్ భారతదేశం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆయన పోరాటం తెలుగుజాతికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యాలయ సిబ్బందిని వివరాలు అడుగుతున్న అధికారి రవి

ఉప ఖజానా కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఖజానా కార్యాలయంలో శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కార్యాలయంలోని జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి బి.రవి రికార్డులను పరిశీలించి కార్యాలయ సిబ్బందికి తగ్గు సూచనలు చేశారు.



నేషనల్ ఛాంప్‌కు అభినందన

ప్రజాశక్తి - నందిగామ : ఆగ్రా నగరంలో జరిగిన నేషనల్ లాక్రాస్ ఛాంపియన్షిప్ 2025-26లో సీనియర్ విభాగంలో కాంస్య పథకం సాధించిన క్రీడాకారుడు ఓర్సు వెంకటేశ్వరరాజ్‌ను నందిగామ మాజీ ఎమ్మెల్యే మ్నొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం అభినందించారు. నందిగామ పట్టణ వైసిపి నాయకులు ఓర్సు ఏడుకొండలరావు కుమారుడు వెంకటేశ్వరరాజ్, నందిగామ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఏడుకొండలరావు కుమారుడిని వెంకటేశ్వరరాజును మాజీ ఎంఎల్‌ఎ అభినందించారు.

మృతిచెందిన ఉపాధి కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి మొవ్వ : కృష్ణాజిల్లాలో బుధవారం, శుక్రవారం వారాల్లో ఉపాధి హామీ పనులు చేస్తూ గుండెపోటుతో చనిపోయిన అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామానికి చెందిన చందన నాగ మల్లేశ్వరరావు(42) ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామానికి చెందిన బాణావత్తు వాలి నాయక్ (60)ల కుటుంబాలకు సవరించిన ఉత్తర్వుల ప్రకారం రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఏ పీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చనిపోయిన గ్రామీణ శ్రామికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా పని ప్రదేశాలలో మెడికల్ కిట్లు, షామియానా, మంచినీరు అందుబాటులో అన్ని గ్రామాల్లో ఉంచాలన్నారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉపాధి హామీ పథకం రోజువారీ కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని ప్రథమ చికిత్స అందుబాటులో ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యుడు ఎ. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వాలి నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఉపాధి పనులు జరిగే గ్రామాలలో మౌలిక వసతులు పటిష్టంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఘనగా అంకమ్మ విగ్రహ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండల పరిధిలోని వేములమడ గ్రామంలో శ్రీ రేణుకమ్మ అంకమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎంఎల్ఎను సత్కరించారు. ఈ సందర్భంగా రేణుకమ్మ అంకమ్మ వారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఉచిత మంచినీరు చలివేంద్రాన్ని శాసనసభ్యులు ప్రారంభించారు. టిడిపి అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామ లింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ సీతారామయ్య పాల్గొన్నారు.

జీవనోపాధికి కార్యాచరణ అమలు చేయాలి

- కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో జీవనోపాదుల కార్యాచరణ ప్రణాళికను సమన్వయంతో సమర్థవంతంగా అమలుచేసి ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్తను తయారు చేసేందుకు కృషి చేయాలని, వచ్చే జూన్ నెల మొదటి వారంలో కొత్త రుణాలతో పెద్ద ఎత్తున యూనిట్లు నెలకొల్పుటకు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జీవనోపాదుల కార్యాచరణ ప్రణాళికపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ ఆధ్వర్యంలో జీవనోపాదులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటిలోనూ ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా డిఆర్డిఏ ఆధ్వర్యంలో తయారుచేసిన జీవనోపాదుల



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఆ ప్రణాళిక ప్రకారం జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒక గ్రామం చొప్పున ప్రధానంగా 7 గ్రామాలను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా నూటికి నూరు శాతం పూర్తిస్థాయిలో జీవనోపాదులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు..ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం వెంకట్రావు, వ్యవసాయ అధికారి మనోహర్, మత్స్యశాఖ అధికారి నాగరాజా తదితరులు పాల్గొన్నారు.



బొలిశెట్టికి జ్ఞాపిక అందజేత

ప్రజాశక్తి-కోడూరు : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనసేన పార్టీ పర్యావరణ విభాగ ప్రధాన కార్యదర్శి, జల బిరాధారి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణకు జనసేన పార్టీ కష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సునీత ఆత్మీయ జ్ఞాపికను అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదగా అందించారు. దివిసీమలోని శ్రీకాకుళం ఆంధ్ర మహా విష్ణు దేవాలయం, చల్లపల్లి రాజా కోట, మోపిదేవి సుబ్రమణ్యేశ్వర స్వామి, దివిసీమ జీవనాడి పులిగడ్డ ఆక్విడేట్, హంసలదీవి వేణుగోపాలస్వామి దేవాలయం, పవిత్ర కష్ణ సాగర సంగమంపాటు దివిసీమలో విశేషాలతో కూడిన చిత్రపటాన్ని బొలిశెట్టి సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మండలి వెంకట్రామ్ తో పాటు అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్‌ను కలిసిన భానుమూర్తి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నూతనంగా నియమి తులైన రాష్ట్ర వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావును మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి ఉప పర్యవేక్షణ అధికారి డాక్టర్ భానుమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. తాను వైద్య విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు డాక్టర్ శ్రీహరి రావు బాగా సుపరిచితులు అని ఆయన గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నందు ఎన్నో పదవి బాధ్యతలు చేపట్టారని తెలిపారు. శ్రీహరిరావు నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నప్పుడు డాక్టర్ భానుమూర్తి కార్యదర్శి పదవిలో ఉన్నానని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు.



శ్రీహరిరావును అభినందిస్తున్న భానుమూర్తి



సమగ్ర శిక్ష ఎపిసిగా కుముద్ధిని సింగ్ బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష ఏపీ సి గా ఆర్.కుముద్ధిని సింగ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.కుముద్ధిని సింగ్ కృష్ణా జిల్లా ఏపీ సి గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. తొలుత జిల్లా కలెక్టర్ డి కె బాలాజీని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన ఏపీసిని కార్యాలయ సూపర్డెంట్ జి.శ్రీనివాసరావు, ఎఫ్ఏఒఏ శ్రీనివాస్, ఏపిఓలు ఏడుకొండలు,శ్యామ్, రాంబాబు ,కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

12న ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఉపాధ్యాయుల ఆపరిష్కృత సమస్యల పై ఈ నెల 12న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యుటి ఎఫ్, కష్ణా జిల్లా శాఖ నాయకులు పిలుపు నిచ్చారు.ఈ మేరకు ధర్నాకు సంబందించిన నోటీసు డిఆర్ఓ కె .చంద్ర శేఖర రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పివి జె రామారావుకు శుక్రవారం యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో వారికి అందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం డి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు జె లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు, సిహెచ్ రాజా శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె రంగనాథ్,ఎం వి సత్యనారాయణ, సిహెచ్ శివరామకష్ణ, వి బుజ్జిబాబు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు ఎలిజబెత్‌కు అవార్డు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ టి దీనఎలిజిబెత్ కు 2025 సంవత్సరానికి ఎక్సెలెన్స్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. బెంగళూరు ఎ నీ లెఫ్ గ్రూప్స్ బెంగళూరు(ఇండియా) వారి సారథ్యంలో 2025 అంతర్జాతీయ ఎక్సెంట్ ఎడ్యుకేషన్ అవార్డులు కొలంబో(శ్రీలంక దేశం) లో అవార్డు గ్రహీతలకు అందజేశారు. దీనికిగాను భారతదేశం తరుపున అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర నాయకత్వ అవార్డు అధ్యాపకురాలు దీన ఎలిజిబెత్ కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి తెలిపారు. కళాశాల ఖ్యాతిని ఖండంతరాలకు చాటిన అద్యపాకురాలు దినా ఎలిజిబెత్ శ్రీలంక నుండి తిరిగి రావడంతో శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఎలిజిబెత్ను ఘనంగా సత్కరించి అభినందించారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వచ్ఛభారత్ పరిస రాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో ఇంటింటికి డస్ట్ బిన్ ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఎజేఎల్ నరసింహారావు తెలి పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గృహం

దివిసీమలో అక్రమ లేఅవుట్లు

- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో అక్రమ లేఔట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అధికారులు మాత్రం తమకేమీ తెలియదు అన్నట్లు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దివిసీమలోని పంచాయతీలలో ప్రణాళిక విభాగం సేవలు పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వం నిర్దేశిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అది అమలుకు నోచుకోవడం లేదు. పట్టణ, పల్లె ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. కాగా ముడుపులు చెల్లించిన వారి దరఖాస్తులకు మాత్రమే ముందు అనుమతులు మంజూరు చేస్తున్నారని నియోజకవర్గ వ్యాప్తంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలు ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ కట్టడాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ కట్టడాలకు భారీగా పన్నులు విధించడానికి అవకాశం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలకు ఆదాయం పెరుగుదలపై దష్టి సారించడం లేదని విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. అయితే అధికారులు ముడుపుల మత్తులో అక్రమ కట్టడాలకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో అక్రమ కట్టడాలు అడ్డు అదుపు లేకుండా జరుగుతున్నాయి. కాగా పంచాయతీ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేస్తున్నారు. పంట పొలాలను సైతం ఎటువంటి అనుమతులు లేకుండా ఫ్లాట్లు విడగొట్టి అమ్మకాలు జరుపుతున్నారు.

లేఅవుట్ల కు అనుమతులు పొందాలంటే 3 అడుగుల రహదారితో పాటు 10 శాతం ఖాళీ స్థలాన్ని స్థానిక సంస్థలకు అప్పజెప్పాలి. కానీ 10 శ్శాతం ఖాళీ స్థలం ఇవ్వకుండానే లేఅవుట్లు వేస్తున్నారు. దీనితో లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోంది. ఖాళీ స్థలాలు విడిచి పెట్టుకున్న లేఔట్లకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది. లేఅవుట్ కి రిజిస్ట్రేషన్ విలువ 14 శాతం సొమ్ము వసూలు చేస్తే కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందంటున్నారు. ఇంతటి అవకాశం ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అవనిగడ్డ రెండో వార్డులో ఒక గహానికి పంచాయతీ అధికారులు రెండు సంవత్సరాల క్రితం ప్లాన్ అప్రూవల్ చేస్తే నూతనంగా 100 మీటర్లు పైగా పైపులతో పంట కాలువలోకి మురుగునీటిని విడుదల చేసేలా డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఇటువంటివి చెప్పుకుంటూ పోతే పంచాయతీ ఏరియాలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లు నిర్మాణాలపై కొరడా ఝులిపించాలని ప్రజలు కోరుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ లేఅవుట్



పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు

గురుకుల ప్రవేశ పరీక్షా ఫలితాల్లో 18 మందికి అర్హత


ప్రజాశక్తి - రెడ్డిగూడెం : శుక్రవారం విడుదలైన గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 18 మంది విద్యార్థులు అర్హత మార్కులు సాధించారని ఆ సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల తెలిపారు. రెడ్డిగూడెం, వివిధ గ్రామాల నుంచి వచ్చి ఉచిత శిక్షణ పొందిన 25 మంది విద్యార్థుల్లో మొదటి జాబితాలోనే 18 మంది సీటు సాధించారన్నారు. దాతల సహకారంతో సిఎస్ఐ కాంపౌండ్‌లో ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసి, మూడు నెలల పాటు తమ సంస్థ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా నాలుగు మోడల్ పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు ఒత్తిడి లేకుండా శిక్షణ ఇచ్చామని తెలిపారు. మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ లక్ష్మీ భార్గవి

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి :
చిన్న వయసులో వివాహం జరగటం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని సిడిపిఒ లక్ష్మీ భార్గవి అన్నారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామంలో సిడిపిఒ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల్లో బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం జరగటం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలని అన్నారు. కిశోర బాలికలకు ఆటపాటలు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఆశాలు ఎంఎస్‌కెలు అంగన్వాడీ టీచర్స్, కిశోర బాలికలు పాల్గొన్నారు.



మఠం శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మఠం శివాలయం పునర్నిర్మాణం కొరకు వీరవల్లి విశ్వేశ్వర రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటగిరి రామ్మోహన్ రావు స్వామివారికి 50,116 రూపాయలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలకు మఠం శివాలయం ట్రస్ట్ అండ్ కమిటీ అభినందనలు తెలిపారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళన

ప్రజాశక్తి - తిరువూరు : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు, కార్యకర్తలు తిరువూరు బోసుబొమ్మ ఆటోస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఆందోళన చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.వి.భద్రం మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచమని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కి నేడు ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్నారని ఆరోపించారు. ఓటమి అధికారులకు వచ్చిన ఏడాది కాలంలోనే మూడుసార్లు ప్రజలపై విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. ఓడ దాటే వరకు ఓడ మల్లయ్య దాటిన తర్వాత బోడు మల్లయ్య అన్న చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే అవి ప్రజలకు తీవ్ర నష్టమని, వాటిని పగల గొట్టండని పిలిపించిన లోకేష్ నేడు ఆయన ప్రభుత్వమే ఆ మీటర్లను బలవంతంగా పెడుతున్నారని, ఇంతకంటే ప్రజలను మోసం చేయడం మరొకటి ఉండదని భద్రం



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, స్థానికులు

విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలు భారాలు మోస్తున్న ప్రజలపై మళ్లీ కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు ఆకుల రవి, బి.వెంక టేశ్వరావు, నాగుల్ మీరా, ఎం.చింతయ్య, ఉమామహేశ్వరరావు, పి.రామకృష్ణ, ప్రకాష్‌రావు, కృష్ణ, జెట్టి శ్రీనివాసరావు, మస్తాను, కె.వెంకటరత్నం, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు రూ.600 కనీస వేతనమివ్వాలి: కళ్యాణ్

ప్రజాశక్తి - తిరువూరు : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు రోజు వారి వేతనం రూ.600 ఇచ్చి పని దినాలను 200 రోజులకు పెంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాల్గో రోజు తిరువూరు మండలంలోని చింతలపాడు, రోలుపడి, ఎరుకోపాడు, ముష్టికుంట్ల, మునకుళ్ళ గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పథకం పరిరక్షణ యాత్ర నిర్వహించారు. కళ్యాణ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, ఉపాధ్యక్షుడు పానెం ఆనందరావు, రైతు సంఘం జిల్లా నాయకుడు సాంబారు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రుక్మిణి, జమలమ్మ పాల్గొని కూలీలు చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక పక్క వ్యవసాయ పనులు క్రమేపీ తగ్గిపోతున్నాయని, రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న కూలీలకు 100 రోజుల ఉపాధి పనులే దిక్కవుతున్నాయని కళ్యాణ్ అన్నారు. పనిచే సిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, 13 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వంద రోజుల పనులకు 100 రోజులైనా వేతనాలు రాకపోవడంతో ఏ రోజు కూలి డబ్బులతో ఆ పూట



ఉపాధి కార్మికులతో కళ్యాణ్, వెంకటేశ్వర్లు, తదితర నాయకులు

గడిచే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో కనీస వసతులకు ఉండటం లేదన్నారు. పనిముట్లు ఐదేళ్లుగా ఇవ్వటం లేదని, పే స్లిప్పులకు డబ్బులు లేవని, వేతనాలు సక్రమంగా రావటం లేదని, పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు జాడలేదని, మేట్లకు పారి తోషకం ఇవ్వడం లేదని ఎక్కడికి వెళ్ళినా కార్మికులు ఏకరువు పెడుతున్నారని కళ్యాణ్ తెలిపారు. ఇబ్బందులకు గురిచేస్తే ఉపాధి పనులు కూలీలు చేయరని, ఫలితంగా ఈ పథకాన్ని రద్దు చేయవచ్చనే కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని కళ్యాణ్ మండి పడ్డారు. ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని దీనికి కూలీలందరూ కదిలి రావాలని కళ్యాణి పిలుపునిచ్చారు.

అన్నదానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, టిడిపి నాయకులు కుంచాపర్తి నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా శనివారం అన్న క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం నాగేశ్వరరావుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, కళ్యాణం మురళి, బొల్లా వెంకటేశ్వరరావు, బొల్లా పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని డివిఆర్ నగర్ సుందరయ్య భవన్‌లో సిఐటియు మండల సదస్సు శుక్రవారం సిఐటియు కార్యాలయంలో డి.సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర సమైక్య ప్రజా సంఘాలు మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కార్మికులను, ఉద్యోగులను మరింత అభద్రతలోకి నెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అన్ని కార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. అన్ని పట్టణ, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ప్రదర్శన సభలలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల కార్యదర్శి ఎస్.కె గౌస్ మియా, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్తపల్లి బేబీ రాణి, దుర్గా భవాని, కనకదుర్గ, రేణుక, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలుకమ్మ, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకులు గొట్టుముక్కల నాగమణి, విద్యార్థి సంఘం నాయకులు జి. ప్రణయ్, రైతు సంఘం నాయకులు కె.వెంకటేశ్వరరావు, మధ్యాహ్న భోజన నాయకులు పద్మ, మహిళా సంఘం నాయకురాలు సోమోజీ



సదస్సులో మాట్లాడుతున్న ఎ.కమల

నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న నూతన 4 లేబర్ కోడ్ రద్దుకు ఈ నెల 20వ తారీకు దేశవ్యాప్తంగా జరగబోతున్న కార్మికుల సమ్మె జయప్రదానికై పట్టణంలోని డివిఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి అగ్నిపర్తి కమల, మండల నాయకురాలు సోమోజు నాగమణి, మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా, అధ్యక్షులు సుధారాణి, మున్సిపల్ నాయకురాలు ఎలకమ్మ. కౌలు రైతు సంఘం నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, కోట రవి కుమార్, మున్సిపల్, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఎ తాతయ్య

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ హబ్‌గా పేట : కలెక్టర్, ఎంపి

ప్రజాశక్తి జగ్గయ్యపేట:
జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఆర్డీవో బాలకృష్ణ, తహశీల్దార్ మనోహర్ లతో కలిసి మండలంలోని వేదాద్రి గ్రామంలో 700 ఎకరాలు, జయంతిపురం గ్రామంలో ఏపీఐఐసీ ల్యాండ్ 498 ఎకరాలు, గవర్నమెంట్ ల్యాండ్స్ 313 ఎకరాలు ల్యాండ్లను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం పెద్దలు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ హబ్ గా తీర్చిదిద్దడం కోసం చాలా మంచి పరిణామని దీనివలన యువతకు ఉద్యోగాల, నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని గణపవరం, వెల్వడం విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మరమ్మత్తులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గణపవరం విద్యుత్ శాఖ ఎఇ సిహెచ్.రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మన ఊరి పాఠశాలలో మీ పిల్లలను చదివించండి

ప్రజాశక్తి విస్సన్నపేట : విసన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామ పంచాయతీలోనీ ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటికీ తిరిగి తమ పిల్లలను మన ఊరి పాఠశాలలో చదివించాలని కోరారు. మన ఊరి పాఠశాల మోడల్ స్కూల్‌గా ప్రభుత్వం గుర్తించిందని ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఉంటారని, పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు యూనిఫామ్ ఉచితంగా ఇవ్వబడతాయని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం ద్వారా మంచి పౌష్టిక ఆహారం అందించబడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయురాలు నాగ మాధురి తెలిపారు. ఈ సందర్భంగా వారి పిల్లలను మన బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

దద్దోజనం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జిల్లా వాసవి సేవా సమితి కార్యదర్శి పెనుగొండ రామకృష్ణ (శ్రీకాంత్ కుమారుడు) మనవడు సంజిత్ 5వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బలుసుపాడు జంక్షన్‌లో గల పెనుగొండ వారి ఎరువుల షాపు వద్ద దద్దోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సంపత్ కుమార్, జేఆర్సి విద్యాసంస్థల కార్యదర్శి పెనుగొండ రాజీవ్, పెనుగొండ శ్రీకాంత్, మాస్టర్ కాకరపర్తి నాగ పరిమళ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



గన్నవరంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు


ప్రజాశక్తి-గన్నవరం : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేబర్ కోడ్లను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను తెలిపారు. పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. సమ్మెలో అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొవాలని కోరారు. సూరగాని సాంబశివరావు, కళ్ళం రాంబాబు, మల్లంపల్లి లలిత కుమారి, రమణ, మరియదాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** :20 తారీకు దేశ వ్యాప్త సమ్మెను, గ్రామీణ హార్తల్ ను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. శుక్రవారం బంటుమిల్లిలోని గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో సిఐటియు, రైతు కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక చేతివత్తుల దారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తానని చెప్పి దాటవేశారని, కార్మికుల పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా తీసుకొచ్చారని వెంటనే కార్మిక కోడ్లను వెనక్కి తీసుకుని 44 చట్టాలను తీసుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి లంక దాసుల అజయ్ గోష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సెక్రెటరీ సభ్యులు నాగిశెట్టి చంద్రశేఖర్, మండల నాయకులు నాగిశెట్టి కష్ణ, బొడ్డు నాగరాజు, చేతి వత్తిదారుల నాయకులు పొదిలి వెంకన్న, సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : దేశవ్యాప్తంగా జరిగే కార్మిక వర్గ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరసన తెలియజేయాలని అఖిలపక్ష రైతు సంఘాలు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక సిపియం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కౌలు రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ఈనిరసనలో ప్రతి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.కౌలు రైతు సంఘం నాయకులు సాయిన రాజేంద్రప్రసాద్, రైతుసంఘం నాయకులు మసిముక్కు సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శొంఠి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : ఈనెల 20వ తారీఖున జరిగే దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం పెనమలూరు మండలం సిఐటియు ఆధ్వర్యంలో పోరంకి బందర్ రోడ్డు లో ఉన్న యూనియన్ బ్యాంకు, కరూర్ వైశ్య బ్యాంకు,స్టేట్ బ్యాంకు,. తాడిగడపలోని సప్తగిరి బ్యాంకు యూనియన్ బ్యాంక్‌లకి సమ్మె నోటీసులు ప్రజాసంఘాల నాయకులు అందించారు. పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, సిపిఎం నాయకులు సిహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి మచిలీ పట్నం అర్బన్** : సివిల్ సప్లై హమాలీలకు తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు నగర కార్యదర్శి కృష్ణాజిల్లా హమాలి ముఠా యూనియన్ ఉపాధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం సివిల్ సప్లై అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో సివిల్ సప్లై హమాలీలు పాల్గొంటామని, విధులకు హాజరుకామని ఈ సందర్భంగా తెలిపారు. హమాలీలకు ఈఎస్ఐ తదితర వైద్య సేవలు పొందడానికి అవరోధంగా ఉన్న కోర్టు కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. సిఐటియు మండల కార్యదర్శి చిరువోలు జయరావు హమాలి ముఠా జిల్లా కార్యదర్శి జే నాగ శివ నగర కార్యదర్శి కే రాంబాబు తదితర కార్మికులు పాల్గొన్నారు.



గుడివాడలో...



బంటుమిల్లిలో...



పెనమలూరు మండలంలో...



మచిలీపట్నంలో...

పలుచోట్ల కిషోర వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : కిశోరి బాలికల వ్యక్తి గత పరిశుభ్రత కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి పద్మాదేవి అన్నారు. కిశోరి బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం మండలం లోని తేలప్రోలు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎస్ కె జి కామాక్షి, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, విఓఎ రమాదేవి, ఇందుమతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాల్య వివాహాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, శుభ్రత, పరిశుభ్రత, ఐరన్ లోపాలకి తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసు బి. పద్విజ , ఏఎన్ ఎమ్ నాగ రాజేశ్వరి, ఆశ వర్కర్ కె. సలోమి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : బాల్య వివాహాలను చేయడం నేరమని పమిడిముక్కల మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉషా అన్నారు. పమిడిముక్కల అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విజయనిర్మల, వెంకటరమణ, విజయకుమారీ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లంకపల్లిలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, ఎఎన్‌ఎం వసంత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - నందివాడ** : బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్.నాగశిరీష అన్నారు. శుక్రవారం నందివాడ మండలం పెదవిరివాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన , కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలవల్ల చిన్న వయసులో గర్భధారణ, మాత శిశు మరణాలకు దారితీస్తాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లలితా రాణి, జ్ఞానేశ్వరి, నిర్మల, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.**ప్రజాశక్తి ఉయ్యూరు** : బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని బోళ్లపాడు ఏఎన్‌ఎం రోహిణి కోరారు. శుక్రవారం వెల్నెస్ సెంటర్లో కిషోరీ వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతు సేవ పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర, జయచింత పలువురు సిబ్బంది పాల్గొన్నారు.అలాగే మండలంలోని కాటూరు ఒకటి, రెండు సచివాలయాల్లో కిషోరి వికాస కార్యక్రమం నిర్వహించారు. **ప్రజాశక్తి-మొవ్వ** : కూచిపూడి సెక్టార్ పరిధిలోని కూచిపూడి-1 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం' కిశోరి వికాసం వేసవిశిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ వి శైలజ పాల్గొని కిషోర బాలికలకు పలు సూచనలు ఇచ్చారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులు రక్షణ-ఫోక్సో చట్టం గురించి వెల్లడించారు. సెక్టార్ సూపర్వైజర్ ఏఎస్ కళ్యాణి, మహిళా పోలీస్ జీ భార్గవి, ఏఎన్‌ఎం దగానివసుంధర, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : కిషోర్ వికాసం మే 2 నుంచి జూన్ 10వ తారీఖు వరకు జరుగు తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ పద్మావతికి తెలిపారు. శుక్రవారం కేసరపల్లి లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నపిల్లలకు వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలను తెలిపారు. చైల్డ్ లైన్ నుంచి వచ్చిన ప్రేమ మాట్లాడ ఆడపిల్లల ఎడల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కేసరపల్లిలో ఎస్సీ ఏరియాలో కూడా కిశోర బాలికల ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : పెనమలూరు మండల పరిధిలోని గంగూరు,వణుకూరు గోసాల సచివాలయం పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల్లో కిషోర వికాసంపై అవగాహన కల్పించారు. గోసాల అంగన్వాడి కేంద్రం 1లో సూపర్వైజర్ కే శ్రీలత పాల్గొని మాట్లాడారు. మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, కిషోరి బాలికలు, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి, మోటూరు, మల్లాయిపాలెం, దొండపాడు గ్రామాలలో కిశోర వికాసంపై అవగాహనా కార్యక్రమం శుక్రవారం జరిగింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నసీరున్నీసా, ఎఎన్‌ఎం వీరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలం లంకపల్లిలో...



ఉంగుటూరు మండలంలో...



గూడూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ కాగిన కృష్ణప్రసాద్

ఎంఎల్ఎల ఆధ్వర్యంలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి గూడూరు : పెడన నియోజక వర్గంలోని గూడూరు మండలం టిడిపి కార్యాలయంలో ఎంఎ ల్ఎ కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారులు, నాయకుల నుండి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి సమస్యను వెంటనే పరిశ్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ పోతన స్వామి, ఎన్ ఎ భేగ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : వెనిగండ్ల

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తు న్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 29వ వార్డులో ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఇతర అధికారులు, కూటమి నేతలతో కలిసి సచివాలయంలో ప్రజల నుండి సమస్యల అర్జీలను ఎమ్మెల్యే రాము స్వీకరించారు. ఈ సంద ర్భంగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పలు సమ స్యలను ఎమ్మెల్యే రాము తక్షణమే పరిష్కరించారు. జనసేన నాయ కులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబా బు, నాయకులు శొంఠి రామకష్ణ, సాంబశివరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు: యార్లగడ్డ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గన్నవరం నియోజకవర్గంలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండల కేంద్రమైన బాపులపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక గ్రామసభ నిర్వహించి ప్రజల సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలను వెంకట్రావ్ కు ప్రజల విన్నవించగా నిర్దిష్ట గడువులోగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను అయన ఆదేశించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, గన్నవరం డిఎస్పీ చలసాని శ్రీనివాస రావు, తహసీల్దార్ రామకష్ణ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేష్ బాబు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపటం అర్బన్ : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్టణం కోనేరుసెంటర్‌లో అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షులు గడ్డం రాజు, మెట్టు సూరిబాబు, మోకా అప్పారావు, సత్యనారాయణ ,శ్రీనివాస్, నాగమణి , లతీఫ్ ఉన్నిసా సిబ్బంది పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు శాసన సభ్యులు బోడే ప్రసాద్ కుమారుడు బోడే వెంకట రామ్ పుట్టినరోజును కంకిపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టిడిపి, జనసేన పార్టీ నాయకులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని వెంకట్రామ్‌తో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.టిడిపి నాయకులు కిషోర్ బాబు, విక్రమ్, వెంకట్, జనసేన నాయకులు పులి కామేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రతి కుటుంబానికీ తాగునీరు : కలెక్టర్

విజయవాడ : ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేందుకు వీలుగా గ్రామస్థాయి సంయుక్త తనిఖీ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి పైప్ లైన్ చివరివరకు నీటిసరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా గ్రామస్థాయి సంయుక్త కమిటీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా పైప్ లైన్ లీకేజీలు, రిపేర్లు, కొత్త పైప్ లైన్ వేయవలసిన అవసరాలు, సమీప మురుగునీటి డ్రైనేజిలో కలిసి ఉండే పైప్ లైన్లు, మంచినీటి వనరు మూలస్థానం వద్ద (సోర్సు) పరిశుభ్రత తదితర కార్యకలాపాలను పరిశీలించేందుకు వీలుగా గ్రామస్థాయి సంయుక్త తనిఖీ కమిటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీలో గ్రామ సర్పంచ్, ఇద్దరు వార్డ్ మెంబర్లు, జల్ జీవన్ మిషన్ మెంబరు, పంచాయితీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో కూడిన కమిటీ మూడు రోజులు గ్రామస్థాయిలో పైన పేర్కొన్న మంచినీటి సరఫరాకు సంబంధించిన పనులను పూర్తి చేసి, వాటిలోని లోపాలను గుర్తించి త్రాగునీటి సరఫరా తనిఖి అనే అప్లికేషన్ ట్రైల్‌లో నమోదు చేయాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డివిజనల్ పంచాయితీ అధికారి విజయవాడ, జిల్లా గ్రామ పంచాయితీ అధికారులను కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆ ప్రకటనలో తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న లారీ ఓనర్స్, వాకర్స్

త్రివిధ దళాలకు సంఘీభావంగా లారీ ఓనర్స్, వాకర్స్ ర్యాలీ

విజయవాడ : సరిహద్దు వెంబడి పాకిస్తాన్ సైన్యం దుశ్చర్యలను సమర్ధంగా తిప్పికొడుతున్న భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా, కేంద్రప్రభుత్వానికి మద్దతుగా శుక్రవారం సాయంత్రం విజయవాడలో బెంజిసర్కిల్ నుండి పివిపి మాల్ వరకు ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, లయోలా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్ల జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగుమోతు రాజా, రావి శరత్ బాబు, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు, లారీ ఓనర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షులు కోనేరు జగదీశ్వరరావు, ఏపీ, తెలంగాణ ప్యాక్డ్ ఎల్.పి.జి. ట్రాన్స్ పోర్టర్స్ సంఘం అధ్యక్షులు సూరపనేని సురేష్, గద్దె అనురాధ తదితరులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర

పేటలో 'విజన్ 2047' సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండే ఆంధ్రప్రదేశ్ విజన్ 2047 ప్రణాళికపై సమగ్రంగా చర్చించేందుకు జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) అధ్యక్షత వహించగా, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్, నియోజకవర్గంలో ఉన్న తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల మండల్ స్థాయి అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, రోడ్లు వంటి అంశాల్లో వేగవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. శుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే రాజగోపాల్ సూచించారు. ప్రజలకు సేవలు సులభంగా అందేలా డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా పౌర సేవల విస్తరణ, సంబంధిత ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు మెరుగుపరచడంపై చర్చించారు. పచ్చదనం పెంపుదల, వృక్షారోపణ కార్యక్రమాలు, మురుగునీటి శుద్ధి కేంద్రాల స్థాపన తదితర పర్యావరణ అనుకూల కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. మహిళల భద్రత, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలు, వృద్ధులు, వికలాంగులు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో సమర్థత పెంచాలని నిర్ణయించారు. ఉపాధి అవకాశాలు–యువతకు ప్రాధాన్యత అంశాలపై మాట్లాడారు. చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ 'జగ్గయ్యపేటను విజన్ 2047 లో భాగంగా సమగ్రంగా అభివృద్ధి చేయడమే మున్సిపల్ పాలకుల ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్, వత్సవాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.రాంబాబు, పెనుగంచిప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీను, జగ్గయ్యపేట తహశీల్దార్లు ఎం.మనోహర్, నందిగామ తహశీల్దార్ కె.సురేష్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక 22వ డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో కూడా శానిటేషన్ అధ్వానంగా తయారయ్యి, దోమల బెడద పెరిగిపోయిందని సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి పి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు అన్నారు. శానిటేషన్ మెరుగుపరిచి, దోమలను నివారించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ 22వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానికరామ్‌కు సిపిఎం నేతలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ, చిన్నారావు మాట్లాడుతూ కృష్ణలంక పరిధిలోని ఆయా డివిజన్లలో ప్రజారోగ్య వ్యవస్థ దెబ్బతిన్నదని, రోజురోజుకు దోమలు పెరిగిపోయి, ప్రజలు పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, అయినా నగరపాలక సంస్థ మొక్కుబడి చర్యలకే పరిమితం అవుతుందని అన్నారు. డ్రెయినేజి వ్యవస్థ అధ్వాన్నంగా తయారయిందన్నారు. డ్రెయిన్లలో పెరిగిపోయిన షిల్టు, ఇళ్లల్లో మరుగుదొడ్ల కనెక్షన్లు నేరుగా డ్రెయిన్లలోకి కలుపుతుండటంతో కృష్ణలంక 22వ డివిజన్‌లోని ఆయా వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు అనారోగ్యానికి గురిఅవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీధుల స్వీపింగ్ కూడా సరిగా జరగడం లేదన్నారు. మురికివాడలయిన కృష్ణలంక



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

22, 21, 20, ఇతర డివిజన్లలో కూడా మునిసిపల్ కార్మికుల సంఖ్య తగ్గిపోయి, ఉన్న కార్మికులపై అదనపు పని భారం పడుతుందని అన్నారు. శానిటేషన్ మెరుగుదల చేసి, దోమలను నివారించి, బ్లీచింగ్ చల్లి, వీధులన్నీ శుభ్రం చేయకపోతే స్థానిక ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తూబాటి తాండవ కృష్ణ, గోకా సూర్యనారాయణ, తెలుగు సూరిబాబు, కోర్లట్ల రవణమ్మ, బత్తుల కవితమ్మ, ఆకుల దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కియా కారెన్స్ క్లావిస్‌కి బుకింగ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

కారెన్స్ పోర్ట్‌ఫోలియోకు తాజా జోడింపుగా కారెన్స్ క్లావిస్‌ను ఆవిష్కరించినట్లు ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ కియా ఇండియా డైరెక్టర్ గంగూలీ ఒక ప్రకటనలో తెలిపారు . దీనికి గానూ శుక్రవారం అర్ధరాత్రి నుంచి బుకింగ్‌లు ప్రారంభం అవుతున్నట్లు చెప్పారు. పెద్ద, బోల్డ్, విశాలమైన 3రో వాహనంగా ఇది రూపుదిద్దుకుందన్నారు. కారెన్స్ క్లావిస్ నేటి పెద్ద, ఆధునిక కుటుంబాల కోసం రూపొందించబడిందని, ఎంపివిలు, ఎస్‌యువిల మధ్య అంత రాన్ని తగ్గిస్తుందన్నారు. ఇది అధునాతన సాంకేతికత, భద్రత, భవిష్యత్తుకు అనుగుణంగా స్పేస్, బోల్డ్ డిజైన్‌ను మిళితం చేస్తుం దన్నారు. కేవలం మూడేళ్లలోనే 2 లక్షలకు పైగా కుటుంబాల నమ్మకాన్ని సంపాదించిందని, భారతీయ కుటుంబాల పట్ల కియా లోతైన అవగాహనలో నుంచి వచ్చిందే కారెన్స్ అన్నారు. స్పేస్, సౌకర్యం, భావోద్వేగ ఆకర్షణతో అందరి మనస్సులను తాకిందని తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన దుర్గగుడి నూతన ఇఒ

ప్రజాశక్తి - విజయవాడ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన వికె.శీనా నాయక్ కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ క్యాంపు కార్యాలయంలో కలిసిన శీనా నాయక్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, చిల్లకల్లు వాసులు

సిందూర్ విజయంపై ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పహల్గాం ఉగ్రవాదుల దాడికి నిరసనగా పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా చిల్లకల్లు పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, జిల్లా టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం, పార్టీలకు అతీతంగా భారీగా ర్యాలీలో పాల్గొన్న షేర్ ముహమ్మద్ పేట గ్రామస్తులు జై భారత్ అంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

విద్యాసాగర్‌కు మద్దతుగా తీర్మానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మూడు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో సేవలందిస్తున్న ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలపర్తి విద్యాసాగర్ రాష్ట్ర అధ్యక్షులుగా అభ్యర్థిత్వానికి జిల్లా పూర్తి మద్దతు తెలుపుతుందని జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం చేస్నిట్లు ఎన్జీజీవో అధ్యక్షులు డి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్‌జిఒ హోంలో జిల్లా ఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం డి.సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత అధ్యక్షులు కేవీ శివారెడ్డి పదవీకాలం ఈ నెలాఖరుకు ముగుస్తున్న నేపథ్యంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించగలిగే నాయకత్వానికి విద్యాసాగర్ మంచి ఉదాహరణ అన్నారు. చేపట్టిన ప్రతి పదవికి న్యాయం చేసిన చరిత్ర ఆయనకు ఉందన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎదుర్కొన్న అనేక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంలో జిల్లా ఎన్జీజీవో పూర్వ అధ్యక్షుడిగా ఆయన అనుసరించిన పోరాట విధానాల వల్లనే ఉద్యోగులకు ఎంతోకొంత ఉపశమనం లభించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన వేతన సవరణ కమిషనర్‌ని వెంటనే ఏర్పాటు చేయాలని, వేతన సవరణ 01 జులై 2023 నుంచి అమలు చేయవలసి ఉండగా, నేటి వరకు వేతన సవరణ కమిషనర్‌ని నియమించడంతో ఉద్యోగులు తమకు హక్కుగా దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నష్టపోతున్నారని వెంటనే కమీషనర్‌ను నియమించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. ఉద్యోగులకు బకాయి ఉన్న మూడు డి.ఏలు మంజూరు చేయవలసి ఉందన్నారు. కనీసం ఒక డి.ఏ మంజూరు, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా సహాధ్యక్షులు వివి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద పెండిరగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షన్‌దారులు సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర నాయకత్వం అడుగులు వేస్తోందని అన్నారు. జిల్లా కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన విద్యాసాగర్ వంటి నాయకులు ఇటువంటి కీలక సమయంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సతీష్ కుమార్, జి.రామకృష్ణ, ఎం.రాజుబాబు సిహెచ్.దిలీప్ కుమార్, బి.నాగేంద్రరావు, డి.విశ్వనాథ్, కె.శివలీల, నగర శాఖ అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కె నజీరూద్దీన్ జిల్లాకు చెందిన తాలూకా యూనిట్ కార్యదర్శులు పురుషోత్తం రాజు ప్రకాష్ శ్రీనివాస్ వెంకటేశ్వరరావు సాంబశివరావు రఘుపతి రవి కుమార్ శివారెడ్డి తాలూకా యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, డిఇసి మెంబర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి